క్లుప్తంగా

రిటైర్డ్ హెచ్‌ఎంకు నివాళి



రిటైర్డ్ హెచ్‌ఎం వెంకట్రామప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న కొత్తకోట సోమశేఖరరెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పిచ్చల వెంకటరామప్ప శనివారం బుక్కపట్నం మండలం జానకంపల్లి స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖరరెడ్డి, పార్టీ నేతలతో కలిసి ఆదివారం వెంకటరామప్ప మృతదేహానికి నివాళులు అర్పించారు. వెంకటరామప్ప భార్య గౌరమ్మ, కుమారులు మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాధవరెడ్డిని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్కూటీ దగ్ధం

కదిరి టౌన్: పట్టణంలోని నానాదర్గా వద్ద బ్రిడ్జ్ పనులు జరుగుతున్న ప్రదేశంలో కదిరికి చెందిన యువకుడు కొత్త రోడ్డులో హోండా డ్యూయో (స్కూటీ) వీలింగ్ చేస్తున్న మంటలు వచ్చాయి. భయపడిన సదరు యువకుడు స్కూటీని వదిలి పారిపోయాడు. మంటలు ఆర్పేలోపు స్కూటీ పూర్తిగా కాలిపోయిందని పోలీసులు తెలిపారు. బండి వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ షబ్నం

నల్లమాడ: మండలంలోని ఆర్.రామాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 5వ తరగతిలో ప్రవేశానికి 436 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 392 పరీక్షకు హాజరయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 326 మంది దరఖాస్తు చేసుకోగా 276 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ హేమ ఓ ప్రకటనలో తెలిపారు. పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ షబ్నం పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

నేడు ప్రచార భేరి

కనగానపల్లి: మండల కేంద్రంలో సోమవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు తెలిపారు. దీనిపై ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వామపక్ష పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈ ప్రచారభేరి కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జికి సన్మానం




సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న న్యాయవాదులు

కదిరి టౌన్: కదిరి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు విశాఖపట్నానికి బదిలీ కావడంతో ఆదివారం సాయంత్రం కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కొత్త భవనంలో ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూల నరసింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి స్థానిక సంస్థల ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని పేర్కొన్నారు.

నేలకూలిన జువ్వి చెట్టు



నల్లమాడ: నల్లమాడ–మలకవేమల రహదారిలో కొత్తపల్లి తండా వద్ద శనివారం రాత్రి 11 గంటల సమయంలో గాలివానకు జువ్వి మాను నేలకూలింది. రోడ్డుపై అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేళ్లమద్ది సర్పంచ్ బొజ్జే నాయక్ సమాచారంతో తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఆర్‌అండ్‌బీ సిబ్బంది ఆదివారం ఉదయాన్నే తండాకు చేరుకొని రోడ్డుపై అడ్డంగా పడివున్న వృక్షాన్ని తొలగించారు. రాకపోకలను పునరుద్ధరించారు. వంగిపోయిన విద్యుత్ స్తంభానికి మరమ్మత్తులు చేశారు.

సిరులు కురిపిస్తున్న అరటి

- అరటి సాగుకు మొగ్గు చూపిన రైతులు
- ఆశాజనకంగా పంట దిగుబడులు
- టన్ను రూ.17 వేల వరకూ పలుకుతున్న ధరలు

తాడిమర్రి: అన్నదాతలకు సిరులు కురిపిస్తున్న పంటల్లో అరటి ఒకటి. గతంలో అరటి సాగుకు రైతులు వెనుకంజ వేసేవారు. అయితే గత నాలుగేళ్లు విస్తారంగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. చెరువులు, బావుల్లో నీటి లభ్యత పెరగడంతో పంటల సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. ఫలితంగా ధర్మవరం నియోజకవర్గంలో విస్తృతంగా సాగులోకి వచ్చింది. తాడిమర్రి మండలంలో 500 హెక్టార్లు, బత్తలపల్లిలో 100, ధర్మవరంలో 50 హెక్టార్లు, ముదిగుబ్బ మండలంలో 150 హెక్టార్లలో అరటి సాగు చేస్తున్నారు. తాడిమర్రి మండలంలో గతంలో దాడితోట, నాయనపల్లి, తురకవారిపల్లి, చిల్లవారిపల్లి గ్రామాల్లో అరకొరగా అరటి సాగు చేసేవారు. అయితే గత నాలుగేళ్లుగా వర్షాలు అధికంగా కురవడం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు ఎత్తి దిగువకు (చిత్రావతి నదికి) నీటిని విడుదల చేయడంతో బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు దాడితోట, నాయనపల్లి, తురవారిపల్లి, చిల్లవారిపల్లి గ్రామాలతో పాటు ఏకపాదంపల్లి, రామాపురం, కునుకుంట్ల గ్రామాల్లోనూ అరటి సాగులోకి వచ్చింది. అంతేకాక ఒక్కసారి మొక్కలు నాటితే మూడేళ్ల పాటు పంట దిగుబడి వస్తుంది. పెట్టుబడుల ఖర్చులు కూడా తగ్గుతాయని భావించిన రైతన్నలు అరటి సాగు వైపు దృష్టి సారిస్తున్నారు.



దాడితోట వద్ద సాగు చేసిన అరటి తోట



చిల్లవారిపల్లిలో ఏపుగా పెరిగిన అరటి గెల

పెరిగిన ధరలు

రెండేళ్ల క్రితం టన్ను ధర రూ.7 నుంచి రూ.8 వేలు ఉండేది. ఈ ఏడాది టన్ను రూ.16 వేలు, రూ.17 వేల వరకూ పలికింది. అలాగే మార్కెటింగ్ సౌకర్యం కూడా అరటి సాగుకు కలసి వస్తోంది. పులివెందుల, తాడిపత్రి తదితర పట్టణాలకు చెందిన వ్యాపారులు తోటల వద్దకు వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. అరటి సాగుకు మొక్కలు, ఎరువులు కొనుగోలుకు రాయితీలు అందించాలని రైతులు కోరుతున్నారు.

యాలక్కి రకం సాగు చేస్తే రాయితీలు

యాలక్కి రకం అరటి మొక్కలను సాగు చేస్తే రాయితీలు అందిస్తాం. యాలక్కి రకం అరటి పంటను సాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ.60 వేల రాయితీ అందిస్తాం. ఎస్సీ, ఎస్టీ రైతులు అయితే యాలక్కితో పాటు ఏ రకం మొక్కలను సాగు చేసినా కూడా హెక్టారుకు రూ.60 వేలు రాయితీలు అందిస్తాం. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– అమరేశ్వరి, ఉద్యానవన అధికారి, ధర్మవరం డివిజన్

రూ.6 లక్షల ఆదాయం



అరటి పంట సాగుకు రాయితీలు అందించాలి. రెండు ఎకరాల్లో 3,000 అరటి మొక్కలు పెట్టాను. పంట పెట్టుబడులకు సుమారు రూ.2 లక్షల వరకూ ఖర్చు చేశాను. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వచ్చింది. అలాగే గిట్టుబాటు ధర కూడా లభించడంతో రెండు పంటల్లో ఖర్చులన్నీ పోగా సుమారు రూ.6 లక్షల ఆదాయం వచ్చింది.

– సాయినాథ్‌రెడ్డి, దాడితోట, తాడిమర్రి

గిట్టుబాటు ధర లభించింది



అరటి సాగులో శ్రమకు తగ్గట్టుగానే మంచి దిగుబడితో పాటు గిట్టుబాటు ధర లభించింది. ఆరు ఎకరాల్లో 7 వేల అరటి మొక్కలు పెట్టాను. సుమారు 120 టన్నుల దిగుబడి వచ్చింది. పెట్టుబడి, ఇతర ఖర్చులన్నీ పోనూ రూ.14 లక్షల ఆదాయం వచ్చింది.

–మట్లు హరినాథ్‌రెడ్డి, దాడితోట, తాడిమర్రి.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నల్లచెరువు: ఓరువాయి సచివాలయ పరిధిలోని మారిశెట్టి పల్లి, చెరువువాండ్ల పల్లి గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కె.రమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

యర్రదొడ్డి సచివాలయం పరిధిలో రేపు..

కదిరి అర్బన్: యర్రదొడ్డి సచివాలయం పరిధిలోని మీటేనాయక్ తండా, బోడేనాయక్ తండా, రాందాస్‌నాయక్ తండా, ఈ కొత్తపల్లి, రొద్దంవారిపల్లి, నాగూరువాండ్ల పల్లి గ్రామాల్లో ఈనెల 25న ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్ ఆదివారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని భీమరాయునిపేట గ్రామానికి చెందిన కరణం ఆదినారాయణ చౌదరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు కరణం మనోజ్ చౌదరి, కరణం సుభాష్ చౌదరిలు 100 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీరాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుల నియామకం



కె.శివశంకర్‌రెడ్డి, సి.నాగభూషణ, రమణారెడ్డి

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా మండలానికి ఓ పరిశీలకుడు, సహపరిశీలకుడిని నియమించినట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పుట్టపర్తి అర్బన్ మండలానికి ఆదివారం పరిశీలకులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పుట్టపర్తి అర్బన్ మండల పరిశీలకుడిగా కె.శివశంకర్ రెడ్డి, సహ పరిశీలకులుగా సి.నాగభూషణ, రమణారెడ్డిని నియమించారు. ఫలితంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నియామకం పూర్తయిందని చెప్పారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు మండలాల వారీగా పరిశీలకులను నియమించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపికైన వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడుతామని చెప్పారు. తమ ఎంపికకు సహకరించిన పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆధునిక హంగులతో 'అమృతవల్లి సదన్'



అమృతవల్లి సదన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన అమృతవల్లి సదన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి సంబంధించిన చలపతినాయని సత్రం పునర్ నిర్మాణం అనంతరం అమృతవల్లి సదన్ పేరుతో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దాదాపు 15 సంవత్సరాల పాటు నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, దేవదాయశాఖ మాత్యుల సహకారంతో రూ.2.5 కోట్లతో భక్తుల సౌకర్యార్థం దాదాపు 32 రూములను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అందులో 4 సూట్ రూములు, 13 ఏసీ రూములు, 15 నాన్ ఏసీ రూములను అత్యాధునిక వసతులతో నిర్మించడం జరిగిందన్నారు. ఆలయ ఆవరణలోని కల్యాణ కట్ట, టాయిలెట్లను తొలగించాలని భక్తులు కోరడంతో వాటిని కుడా పూర్తిగా మూసివేస్తామన్నారు. వాటన్నింటినీ భక్తుల సౌకర్యార్థం అమృతవల్లి సదన్‌లోని సెల్లార్ ఏరియాలో గల కొంత భాగంలో కల్యాణ కట్టను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయ సహకారాలు అందజేసిన ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఆలయ ఇంజనీర్లను అభినందించారు. నాణ్యతలో ఎటువంటి రాజీలేకుండా ఒక మంచి భవనాన్ని నిర్మించి భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొచ్చిన కాంట్రాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, మార్కెట్‌యార్డ్ చైర్మన్ మలక సుజాత, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



వెంకటరామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: పార్టీ నాయకులు, కార్యకర్తలకు తోపుదుర్తి కుటుంబం అన్నివిధాలా అండగా ఉంటుందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నామాలలో అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ నాయకుడు వెంకటరామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి,నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి వెంకటరామిరెడ్డి విశేష సేవలు అందించారన్నారు. మృతుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించారు. అనంతరం వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ కృష్ణమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామచంద్రారెడ్డి, నాయకులు మేడాపురం సూరి, తదితరులు పాల్గొన్నారు.

26న ఉచిత ఖత్నా

తనకల్లు: మండల కేంద్రంలో ఈనెల 26న జామియా ఖాద్రియా ముజఫర్ మదరసా, ఖాద్రీయా ఆస్తానా ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఖాద్రియా ముజఫర్ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 30 పడకల ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న మౌలానా సాహెబ్ ఇంటి వద్ద ముస్లిం బాలురకు నైపుణ్యం కలిగిన వైద్యులతో ఖత్నా చేయిస్తామన్నారు. ఖత్నా చేయించుకున్న వారికి ఒక పంచె, గోధుమ పిండి, బెల్లం, మందులు అందజేస్తామన్నారు. మరింత సమాచారం కోసం బూడిద గడ్డ వీధిలోని ఎస్‌ఎం బాషా సైకిల్ షాపులో సంప్రదించాలని సూచించారు.

రూ.25 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణం



నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్టయ్య

బత్తలపల్లి: మండల కేంద్రంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్టయ్య ఎంపీ ల్యాండ్స్ నిధులు విడుదల చేయడం సంతోషకరమని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్టయ్య తన ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి మండల కేంద్రంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయించారని తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు మొదలు పెడతామన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



ఇంటింటికీ కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లమాడ: మండలంలోని దొన్నికోట పంచాయతీ కేంద్రంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రసూల్, నాయకులు నాగరాజు నాయుడు, కమలాకర్ నాయుడు, రామకృష్ణ, చిన్నరాము తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఐచర్



బత్తలపల్లి: ధర్మవరం–బత్తలపల్లి ప్రధాన రహదారిపై మండల పరిధిలోని వేల్పుమడుగు బస్‌స్టేజ్ వద్ద వెళ్తున్న కారును వెనుక వైపు వస్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మండలంలోని గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వరిమడుగు నారాయణరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు ఏపీ 39, సీఈ 6813 నంబర్ కారులో బత్తలపల్లి నుంచి ధర్మవరం వెళ్తుండగా.. వెనుక వైపు వస్తున్న ఐచర్ వాహనం కారును ఢీకొంది. ఐచర్ వాహనం ఢీకొనగానే ఒక్కసారిగా కారు వెనక్కి తిరగబడింది. ప్రమాదం జరగగానే కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ప్రాణాపాయం తప్పింది. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురు గాలుల బీభత్సం



గుంజేపల్లిలో నేలకొరిగిన అరటి చెట్లు

ముదిగుబ్బ: మండలంలో ఆదివారం పలు గ్రామాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. రాళ్లనంతపురం గ్రామంలో ఆదిరెడ్డికి చెందిన రేకుల షెడ్డు గాలులకు ఎగిరిపోయింది. సుమారు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. అదే విధంగా గుంజేపల్లికి చెందిన రైతు వీరనారప్ప రెండు ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట ఈదురు గాలులకు నేలమట్టం అయ్యింది. దాదాపు రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

కంటి వైద్య శిబిరంతో పేదలకు ఊరట



మహిళకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం లయన్స్‌క్లబ్ ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 80 మందికి కంటి వైద్య నిపుణులు కిరణ్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 50 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చందా నాగరాజు తెలిపారు.కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి, కార్యదర్శి గూడూరు మోహన్ దాస్, కోశాధికారి రాజగోపాల్, సభ్యులు గోసే రాధాకృష్ణ, జగదీష్, రమేష్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం వజ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇప్పటి వరకూ 60 వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వజ్రభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం ఆపరేషన్లకు ఎంపికై బెంగుళూరు వెళ్తున్న వారికి ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు భోజన వసతి కల్పించారు.

30 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవాలు

బత్తలపల్లి: మండలంలోని జ్వాలాపురంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ట, స్వామి కల్యాణోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు పుణ్యాహవచనం, రక్షాబంధనం, తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు ధ్వజస్తంభానికి మహాస్నపనము, జలాధివాసము, 2వ తేదీ ఉదయం 7:30 గంటలకు ధ్వజస్తంభానికి ధాన్యాధి వాసం, జపము, క్షీరతర్పణం, హోమం, తయ్యాది వాసం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 3వ తేదీ ఉదయం 7:32 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ట, పూర్ణాహుతి, మంగళహారతి, 4వ తేదీ ఉదయం 7:30 గంటలకు లక్ష్మీనరసింహస్వామికి అవభృత స్నానం, 5వ తేదీ ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకం, తదనంతరం స్వాతి నక్షత్రమున స్వామికి కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. వేడుకలకు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరవుతారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

5 నుంచి ఏటి గంగమ్మ జాతర

తలుపుల: మండల కేంద్రంలోని ఎగువపేటకు సమీపంలో ఏటి గంగమ్మ జాతర మే 5, 6, 7 తేదీల్లో జరగనుంది. ఆదివారం ఏటి గంగమ్మ ఆలయం వద్ద సంబరాల పోస్టర్లను కమిటీ సభ్యులు విడుదల చేశారు. 5వ తేదీ ఏటి గంగమ్మ చెల్లెళ్లు అయిన చింతల గంగమ్మ, గాండ్లపెంట గంగమ్మలకు సారె చీర కార్యక్రమం, రాత్రికి మొలకలు నోమే కార్యక్రమం, గంగమ్మ కథాకాలక్షేపం, 6వ తేదీ రాత్రి హరికథా కాలక్షేపం, బలిజపేట నుంచి చాందినీ బండి ఊరేగింపుతో ఏటి గంగమ్మ అలయం వద్దకు చేరుకోవడం, 7వ తేదీ బోనాల ఊరేగింపు, జంతు బలి, సాయంత్రం ఎద్దుల బండ్ల ఊరేగింపు ఉంటుందన్నారు.

ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేయాలి

నల్లచెరువు: వలంటీర్లు, సంబంధిత అధికారులు, ఆయుష్మాన్ భారత్ సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ శకుంతల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు. సచివాలయ ఉద్యోగులు విధిగా డ్రస్ కోడ్ పాటించాలన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ధర్మవరం రూరల్: పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్‌లో ఆదివారం అక్షయ తృతీయ సందర్భంగా యువ పరివర్తన మిషన్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, గాయత్రి పరివార్ సమితి, సనాతన ధర్మ పరిరక్షణ సమితి, శ్రీలింగేశ్వర దేవాలయ సేవా సభ్యులు పాల్గొన్నారు.

చేపల సొసైటీ కార్యాలయం ప్రారంభం

రామగిరి: పేరూరులో ఆదివారం చేపల సొసైటీ కార్యాలయాన్ని ఎంపీపీ కదిరెన్న, సర్పంచ్ రాజేష్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో పేరూరుడ్యాంలో నీరులేనందున తాగునీరు, సాగునీటికి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో పేరూరుడ్యాంతోపాటు నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవానీటితో నింపినట్లు తెలిపారు. మండల కోఆప్షన్ మెంబర్ ముజుబుర్ రహిమాన్ పాల్గొన్నారు.

పోతలయ్య స్వామి ఆలయంలో పూజలు

కనగానపల్లి: దాదులూరులో వెలసిన పోతలయ్య స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. చుట్టు గ్రామాల స్వామి కాపులు, భక్తులు ఆలయానికి వచ్చి పూజలు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు స్వామికి బోనాలు సమర్పించారు. మామిళ్లపల్లిలో మంగళవారం పోతలయ్య స్వామికి గావుల మహోత్సవాన్ని నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు.